# జనం కోసం.. జలభేరి!

## కేసీఆర్ (భారీ ప్రాజెక్టుల నిర్మాత)

కేసీఆర్ పాలనలో తెలంగాణ జల భాండాగారమైంది. ముంచెత్తే వరదలు, తాండవించే కరువులకు భారీ ప్రాజెక్టుల నిర్మాణంతో చరమగీతం పాడారు కేసీఆర్. భవిష్యత్తు తరాలకు నీటి కష్టం రాకూడదని రాష్ట్రం నలుదిక్కులా జలాశయాల నిర్మాణాన్ని చేపట్టారు. కాళేశ్వరం ప్రాజెక్టు, రంగనాయక్ సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ, అన్నపూర్ణ, బస్వాపూర్ వంటి రిజర్వాయర్లను రికార్డు సమయంలో అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇలా పదేండ్ల వ్యవధిలో 200 టీఎంసీలకు పైగా నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచారు.





## సర్ ఆర్థర్ కాటన్ (డెల్టా ఆర్కిటెక్ట్)

ఈస్టిండియా కంపెనీలో నీటిపారుదల బాధ్యతలు చేపట్టిన సర్ ఆర్థర్ కాటన్ .. చోళ రాజుల స్ఫూర్తితో కావేరి నదిపై పలు ఆనకట్టలు కట్టి.. కరువు కాటకాలతో అల్లాడుతున్న తంజావూరు జిల్లాను అన్నపూర్ణగా మార్చారు. దీంతో ఆ గడ్డ యావత్ భారతదేశంలోనే అత్యంత సుభిక్షమైన ప్రాంతంగా మారింది. ఆ తర్వాత, కాటన్ దృష్టి గోదావరి వైపు మళ్లింది. ధవళేశ్వరం వద్ద ప్రాజెక్టు నిర్మించి అతివృష్టి, అనావృష్టితో అల్లాడుతున్న గోదావరి జిల్లాలకు ముప్పూటలా అన్నం పెట్టారు. డెల్టా ఆర్కిటెక్ట్‌గా కీర్తిగడించారు. కృష్ణా నదిపై ప్రకాశం బ్యారేజీ కాటన్ చలువే. అందుకే ఆయన జన్మదినాన్ని ఈ రెండు ప్రాంతాలవారూ వేడుకలా జరుపుతారు. పుష్కరాల్లో తర్పణాలూ వదులుతారు.

# భగీరథ యత్నం

## కేసీఆర్ (మిషన్ భగీరథ)

తెలంగాణ ప్రజల తాగునీటి కష్టాలను దూరం చేసిన 'మిషన్ భగీరథ' రథసారథి కేసీఆర్. ఇందులో భాగంగానే రాష్ట్రంలో ప్రవహిస్తున్న గోదావరి, కృష్ణా నదీ జలాలను శుద్ధి చేసి పెద్ద పెద్ద పైపులైన్ల ద్వారా ఇంటింటికీ నల్లా నీటిని సరఫరా చేయాలని సంకల్పించారు. 2016లో ఈ జల మహాయజ్ఞానికి శ్రీకారం చుట్టారు. 2018నాటికి రాష్ట్రంలోని అన్ని ఇండ్లకు నల్లా నీటి కనెక్షన్లను ఇచ్చింది తెలంగాణ సర్కారు. అనేక రాష్ట్రాలు ఈ పథకాన్ని ప్రశంసించాయి. మిషన్ భగీరథ యథాతథ అనుకరణే.. కేంద్ర ప్రభుత్వ 'జల్ జీవన్ మిషన్'.





## విశ్వనాథ్ శ్రీకాంతయ్య (ఫ్రీ క్లీన్ వాటర్ ఫర్ ఆల్)

దేశ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలనే సంకల్పంతో కర్ణాటకకు చెందిన సామాజిక కార్యకర్త విశ్వనాథ్ శ్రీకాంతయ్య అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నదీ ప్రవాహాలకు ఏర్పడిన అడ్డంకుల తొలగింపునకు కృషి చేస్తున్నారు. కాలుష్యంలేని సముద్రాలే తన లక్ష్యమని నినదిస్తున్నారు. నీటి మాఫియా పెచ్చరిల్లుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో.. ప్రతి భారతీయుడికి స్వచ్ఛమైన తాగునీటిని ఉచితంగా అందించడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారు. శ్రీకాంతయ్య రూపొందించిన విజన్ 2047ను కేంద్ర ప్రభుత్వం కూడా ప్రశంసించింది. ఆచరణ యోగ్యమని కితాబు ఇచ్చింది.